7న లాభాల వాటా చెల్లింపు!



మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే 33 శాతం లాభాల వాటా వచ్చిందని, వచ్చే నెల 7న కార్మికుల బ్యాంకు ఖాతాలో లాభాల వాటా జమ చేస్తారని పేర్కొన్నారు. పారదర్శకంగా లాభాల వాటా పంపిణీ జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అధ్యక్షుడు వాసిరెడ్డి సీతరామయ్య తెలిపారు. వరద బాధితులకు సహాయం సింగరేణి లాభాల నుంచే చెల్లించడం జరుగుతుందన్నారు. భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 1వ గని ఆవరణలో సీతారామయ్య, కేటీకే 5వ గని ఆవరణలో గురువారం ఏఐటీయూసీ నేతలు సదయ్య, తిరుపతి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఉనికి కోసం ఇతర కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కార్మికుల పక్షాన ప్రభుత్వాలపై ప్రశించేది ఏఐటీయూసీ మాత్రమేనన్నారు. గత పది సంవత్సరాలుగా టీబీజీకేఎస్ గుర్తింపు సంఘం రాజకీయ జోక్యంతో పైరవీలకే పరిమితమైందని ఆరోపించారు. ప్రభుత్వం అధికారికంగా 8 నెలల తర్వాత గుర్తింపు సంఘంగా పత్రాన్ని ఇచ్చిందని, దీంతో త్వరలోనే యాజమాన్యంతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సింగరేణిలో నూతన గనుల తవ్వకాల కోసం శీఘ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. దీపావళి బోనస్ విషయంపై కూడా యాజమాన్యంతో త్వరలోనే చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, రాంచందర్, చంద్రమౌళి, ఆసిఫ్‌పాషా, రాజేందర్, నాగేందర్, నాగేందర్, కుమారస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం సెప్టెంబరు 27, 2024


నలుదిశలా.. ఘనకీర్తి చాటేలా!

● పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు..

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం..

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి, ఈనాడు వరంగల్

పర్యాటక ప్రాంతాల్లో అపరిశుభ్రత, ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకు పోతుండటం ప్రకృతి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తోంది. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో గురువారం 'ఈనాడు' ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. యువత, వాకర్స్, విద్యార్థుల సహకారంతో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించింది. విద్యార్థులు కట్టడాల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ.. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యాటక ప్రాంతాలను కాపాడుకుంటామని ప్రతినబూనారు.





ప్రకృతిహితం

ఖిలావరంగల్, వరంగల్ జిల్లా

● **కార్యక్రమం:** పర్యాటక ప్రాంతాలు కాలుష్యమయం కాకుండా ఉండేందుకు ప్రకృతిహితంగా సైకిల్‌పై వెళ్లి సందర్శించడం, సమీపంలో ఉంటే నడక ద్వారా వెళ్లి చూడటం. సైక్లిస్టులు ఉదయం 6 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ముందు సైక్లింగ్ ప్రారంభించి, సుమారు 15 కి.మీ. దూరంలోని వరంగల్ కోటకు చేరుకున్నారు. ఈ ప్రదేశంలో సైకిల్‌పై తిరుగుతూ కీర్తి తోరణాలు, ఖుష్ మహల్ ఇతర ప్రదేశాలను సందర్శించారు. అనంతరం వాకర్స్‌తో కలిసి రాతి గోడ వరకు నడుస్తూ పర్యాటక ప్రాంతాల్లో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం కట్టడికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు.

● **పాల్గొన్న వారు:** ట్రైసిటీ రైడర్స్ వరంగల్ అసోసియేషన్ సభ్యులు జయరాజ్, విద్యాసాగర్, ప్రసాద్, రవికుమార్, వెంకటేశ్వర్లు, సదాశివరెడ్డి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, సైక్లిస్టులు, ఖిలా వరంగల్‌లోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 60 మంది

● **సందేశం:** కాలుష్యం బారి నుంచి పర్యాటక ప్రాంతాలకు విముక్తి



అవగాహన

ఇనుగుర్తిలోని కాకతీయుల శిలా శాసనాలు: మహబూబాబాద్ ● కాకతీయులు నిర్మించిన శాసనాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన ● జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎ.యాకయ్య, బి.దేవేందర్ ● భావితరాలకు కాకతీయుల శిలా శాసనాలను అందించాలి. - ఇనుగుర్తి (కేసముద్రం)



శ్రమదానం

కాళేశ్వరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● కాళేశ్వరం హరిత హోటల్ సమీపంలో పిచ్చిమొక్కలు తొలగించడం ● హరితా సిబ్బంది, మేనేజర్ జక్కం సురేష్ ● శ్రమదానం చేద్దాం. . పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..– కాళేశ్వరం



చైతన్యం



శ్రీ వేంకటేశ్వర స్వామి సమేత పద్మావతి, అలివేలుమంగమ్మ ఆలయం మహబూబాబాద్ జిల్లా ● ఆలయ విశిష్ఠతపై ఇంటర్మీడియట్ విద్యార్థినులకు అవగాహన ● ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.శేఖర్, ఎస్సై మాలోతు సురేష్, ఆలయ అర్చకులు నందనాచార్యులు, రాంబాబుచార్యులు, ఎంపీవో యాకయ్య ● ఆలయాలు, పర్యాటక ప్రాంతాలపై అవగాహన అవసరం – నర్సింహులపేట (డోర్నకల్)



స్వచ్ఛత


పాండవుల గుట్టలు రేగొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ● పాండవుల గుట్టల్లో, గుట్టల కింద భాగంలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు ● గ్రామస్థులు, యువకులు ● పాండవుల గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారుతుంది. సందర్శనకొచ్చే వారు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి. – రేగొండ

బాధ్యత



రామప్ప ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు ● పాలంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానికులు ● రామప్ప పరిసరాలు శుభ్రత సామాజిక బాధ్యత – వెంకటాపూర్

పరిశుభ్రత



బొగత జలపాతం ములుగు జిల్లా ● పిల్లల పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదల తొలగింపు ● అటవీ, జలపాతం రక్షణ సిబ్బంది ● స్వచ్ఛత పాటిద్దాం, పచ్చదనం పెంచుదాం, పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి భద్రత – వాజేడు



ప్లాస్టిక్‌పై యుద్ధం

లక్నవరం జలాశయం, ములుగు జిల్లా ● ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ● బుస్సాపూర్ మాజీ ఉప సర్పంచి బేతి దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పాశం మాధవరెడ్డి, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది ● పర్యావరణాన్ని రక్షిస్తే మనల్ని మనం కాపాడుకున్నట్లే.. భావితరాలకు బతుకునిచ్చినట్లే. – గోవిందరావుపేట

నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే, ఓఎస్డీ బోనాల కిషన్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్టేషన్ల వారీగా ఆయన నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా ఉంచాలని, దొంగతనాలు జరగకుండా మరింత పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతో పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రాంమోహన్‌రెడ్డి, నారాయణనాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



ఇనుప గేటును పక్కకు నెడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు తెలిపారు. రెండో రోజు గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. జిల్లా కోర్టు ఆవరణలో పరిసరాలను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి శుభ్రం చేశారు. కోర్టు ప్రాంగణంలో ఉన్న ఇనుప గేటును సమీపంలో ఉన్న గోడ పక్కకు ఏర్పాటు చేసి, పిచ్చి మొక్కలు లేకుండా తొలగించారు. కార్యక్రమంలో జడ్జిలు జయరాంరెడ్డి, రాంచంద్రరావు, వీపీ శ్రీనివాస్, న్యాయవాది కవిత, తదితర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలు స్ఫూర్తిదాయకం



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్, కలెక్టర్ రాహుల్ శర్మ



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు ఎస్పీ కిషన్, డీఎస్పీ సంపత్‌రావు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గురువారం జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మతో పాటు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలిసి ఆవిష్కరించారు. ఆమె జయంతిని పురస్కరించుకొని, జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రజక సంఘం ఈ విగ్రహం ఏర్పాటుచేసింది. ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాట యోదురాలు, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను నేటి యువతీ, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దారు శ్రీనివాసులు, కమిషనర్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి శైలజ, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ ఛైర్మన్ హరీశ్‌రెడ్డి, రజక సంఘం నాయకులు సాంబమూర్తి, రమేష్, రవి, మురళీధర్, రఘుపతి, చంద్రమౌళి, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఐలమ్మను సాయుధ పోరాటం, వీరత్వం ఎంతో స్ఫూర్తిదాయకమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలమాల వేసి, నివాళులర్పించారు. కుల సంఘాల భవనాల పనులు వెంటనే పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సెగ్గం వెంకటరాణి, వైస్ ఛైర్మన్ హరీష్‌రెడ్డి, భారాస నాయకులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని, బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రాంమోహన్‌రెడ్డి, నారాయణనాయక్, పలువురు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వరద కాల్వలనూ వదల్లేదు!

న్యూస్‌టుడే, భూపాలపల్లి

జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వరద కాల్వలు పూడ్చివేసి విలువైన భూములను కొందరు కబ్జా చేస్తున్నారు. భూపాలపల్లి నుంచి గణపురం మండలం చెల్పూరు శివారు వరకు ఇదే పరిస్థితి. వరద కాల్వలతో పాటు చెరువు శిఖం భూములను సైతం కొందరు రియల్టర్లు ప్లాట్లుగా విభజించి, విక్రయాలు చేపట్టారు. ఇటీవల కొందరు చెరువు శిఖం భూముల్లో అక్రమంగా కట్టడాలు చేపట్టినా నీటి పారుదలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. చెరువు శిఖం, వరద కాల్వల్లో నిర్మించుకున్న కట్టడాలను కూల్చివేయకుంటే, భవిష్యత్తులో అధిక వర్షాలు పడితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది.



మంజూరునగర్ ప్రాంతంలో కబ్జాకు గురైన గోరంట్లకుంట వరద కాలువ



మైసమ్మ గుడి ప్రాంతంలో కాలువను కుదించి నిర్మించిన సిమెంటు గోడ



కుందూరుపల్లి సమీపాన వరద కాలువను ఆక్రమించి గోడ నిర్మాణం

టాస్క్‌ఫోర్స్ బృందం ఏదీ?

భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ, సీలింగ్, అసైన్డు, చెరువు శిఖం, వరద కాల్వల భూములు కబ్జాకు గురవుతున్నాయి. వీటిపై నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని నియమించారు. చెరువు శిఖం భూములు కాపాడాల్సిన ఈ బృందం పెద్దగా అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ☛ మంజూరునగర్‌లో పాత జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గోరంట్లకుంటకు సంబంధించిన వరద కాలువ కబ్జాకు గురైంది. సుమారుగా 15 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ వరద కాలువ మూడు, నాలుగు మీటర్లే ఉంది. ☛ ఇదే జాతీయ రహదారికి ఆనుకొని మైసమ్మ గుడి ఆలయం సమీపంలో దాదాపుగా 25 నుంచి 30 మీటర్ల వెడల్పు ఉన్న వరద కాలువను ఓ రియల్టర్ అక్రమించుకుని నాలుగు మీటర్లకు కుదించి సిమెంట్‌తో గోడ నిర్మించారు.

☛ కుందూరుపల్లి ఏఎస్ఆర్ గార్డెన్ సమీపంలో వరద కాలువను పూర్తిగా అక్రమించుకుని ఓ వ్యక్తి చుట్టూ గోడ నిర్మించారు. దీంతో వరద కాలువ పక్కనే అంతర్గత రోడ్డు గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా కోతకు గురైంది.

☛ సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందు భాగంలో, రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలో, కేటీకే 5వ గని ఆర్చి ప్రాంతంలో వరద కాల్వలు కబ్జాకు గురయ్యాయి. ఈ వరద కాలువలపైనే కొందరు అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

చుట్టూ ఇనుప కంచె నిర్మిస్తే మేలు

వరద కాల్వలు, శిఖం, ప్రభుత్వ భూముల చుట్టూ అక్రమణకు గురికాకుండా ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తామని గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్లు తెలిపారు. కానీ ఎక్కడ కూడా లేవు కదా కనీసం ఇవి ప్రభుత్వ భూములని బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైన జిల్లా వ్యాప్తంగా చెరువు శిఖం, ప్రభుత్వ, సీలింగ్ భూముల చుట్టూ ఇనుప కంచెలు ఏర్పాటు చేసి విలువైన ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అవసరం ఉంది.

మొత్తం సర్వే చేస్తాం

- బసవ ప్రసాద్, నీటి పారుదల శాఖ డీఈ

గణపురం మండలం చెల్పూరు నుంచి భూపాలపల్లి మున్సిపాలిటీ వరకు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న వరద కాల్వలు సర్వే చేయించి, అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో నిబంధనల ప్రకారం ఎవరూ ఇళ్ల నిర్మాణాలను చేపట్టకూడదు. కొత్తగా ఇళ్ల నిర్మాణాల కోసం నీటి పారుదల శాఖ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్ఓసీ) ఉంటేనే ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వాలని ఇటీవల పురపాలక కమిషనర్‌కు నివేదించాం.

అప్పులపాలై.. ఉద్యోగం కోల్పోయి..

● యువకుడి ఆత్మహత్యకు కారణమదే.. తట్టుకోలేక ప్రియురాలి ఆత్మహత్యాయత్నం



మృతుడు అక్షయ్‌కుమార్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న జయశంకర్ భూపాలపల్లికి చెందిన అక్షయ్‌కుమార్ (24) వద్ద పోలీసులు సూసైడ్ నోటు గుర్తించారు. తాను ప్రేమికుడిని కాదని, జీవితంలో ఓడిపోయానని, అమ్మకి కొడుకుగా కూడా పనికిరానని అందులో పేర్కొన్నారు. అప్పులు చేశానని, ఎవరినీ మోసం చేయాలనుకోవడం లేదని నోట్‌లో రాశాడు. పోలీసుల సమాచారంతో కుమారుడి మరణవార్తను తెలుసుకుని గురువారం ఉదయం కుటుంబసభ్యులు మార్కెట్ ఠాణాకు చేరుకున్నారు. గాంధీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

ఇంటి వద్దే ఉంటానని..

అప్పులపాలు కావడంతోపాటు ఉద్యోగం పోవడంతోనే అక్షయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అతను ఏడాదిగా నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల బైక్ కొనుగోలు చేయగా ఆ సమయంలో రెండ్రోజులు కార్యాలయానికి సెలవు పెట్టాడు. దీంతో అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నెల 22న ఇంటికి వెళ్లి నగరానికి వెళ్లనని, ఇక్కడే ఉంటానని తండ్రికి చెప్పాడు. అదే రోజు సాయంత్రం నగరానికి వచ్చి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. స్నేహితులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అతడి కోసం వెతికారు. 24న రాత్రి సెల్‌ఫోన్ ఆన్ చేయడంతో పాటు స్టేటస్‌లో స్నేహితులు, బంధువుల ఫొటోలతో పాటు ఇదే చివరి రోజు అంటూ మెసేజ్ పెట్టుకున్నాడు. లోకేషన్ ఆధారంగా స్నేహితులు అతడ్ని గుర్తించారు. లాడ్జికి వెళ్లి చూడగా.. అప్పటికే ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా అక్షయ్‌కుమార్ నగరానికి చెందిన ఓ యువతి (23) ప్రేమించుకున్నారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు కూడా చెప్పడంతో పెళ్లికి అంగీకరించారు. బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి లాడ్జికి వచ్చింది. ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుసుకున్న ఆమె బాధను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే స్నేహితులు పోలీసులకు సమాచారం అందించి ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.

పవర్ లిఫ్టింగ్ విజేత శ్రీనివాస్‌రెడ్డి



భూపాలపల్లి, న్యూస్‌టుడే: ఒడిశాలో జరుగుతున్న కోల్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన భూపాలపల్లి డివిజన్ క్రీడాకారుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి బంగారు పతకాన్ని అందుకున్నారు. ఒడిశాలోని ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. పోటీల్లో మొదటి రోజు పాల్గొన్న భూపాలపల్లి ఏరియా కేటీకే 6వ గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి పవర్ లిఫ్టింగ్ 93 కేజీల కేటగిరీలో మొత్తం 595 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించినట్లు భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, అధికార ప్రతినిధి కె.మారుతి తెలిపారు. భూపాలపల్లి ఏరియా నుంచి 8 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనే మొదటి రోజు బంగారు పతకం సాధించిన శ్రీనివాస్‌రెడ్డిని సింగరేణి టీం మేనేజర్ శ్రావణ్‌కుమార్, టీం కోచ్ హెచ్.రమేష్, పర్యవేక్షకులు శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.


నింగి.. నది.. నీలి రంగులో..!



కాళేశ్వరం వద్ద గురువారం సాయంత్రం వేళ ఆవిష్కృతమైన దృశ్యమిది. ప్రాణహితపై నీలి మేఘాలు కమ్ముకోగా, నదిలోని నీరు కూడా పూర్తిగా నీలి రంగులోకి మారింది. అక్కడివారిని ఈ దృశ్యం సంభ్రమంతో ముంచెత్తింది. – న్యూస్‌టుడే, కాళేశ్వరం

చెరువులోనే భవనం..!

● ధర్మసాగర్ జలాశయంలో ఏడాదిగా పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు కబ్జాకు గురువుతుండగా, తాజాగా నిర్మాణాలు ప్రారంభించారు.

ఈనాడు, వరంగల్, ధర్మసాగర్, న్యూస్‌టుడే

రాజధాని హైదరాబాద్‌లోని చెరువు శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే 'హైడ్రా' కూల్చేస్తోంది. కొత్తగా వెలుస్తున్న నిర్మాణాలను కొరడా ఝుళిపిస్తోంది. మన దగ్గర ఏకంగా జలాశయంలోనే ఓ భవనాన్ని నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి గుండెకాయ లాంటి ధర్మసాగర్ జలాశయం గ్రేటర్ వరంగల్ ప్రజల దాహార్తిని తీర్చడంలో ప్రధాన వనరు. ఈ చెరువు శిఖంలోనే ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. ధర్మసాగర్ నుంచి ముప్పారం దారిలో ఉన్న జలాశయం శిఖం భూమిలో ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని ఏడాది కాలంగా చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ అడ్డుకోకపోవడం గమనార్హం.

పట్టాభూమైనా అనుమతి లేదు

అనేక గ్రామాల పరిధిలో చెరువు శిఖం భూముల్లో రైతులకు పట్టా భూములు ఉంటాయి. చెరువులో నీళ్లు లేనప్పుడు పంటలు వేసుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ధర్మసాగర్ చెరువు శిఖంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. పట్టాగా భూమి జలాశయంలో ముంపునకు గురికాలేదని, వ్యవసాయ భూమిని 'నాలా' (వ్యవసాయేతర) భూమిగా మార్పిడి చేసుకున్నట్లు సమాచారం. మరో విచిత్రం ఏంటంటే 'నాలా' కన్వర్షన్ తీసుకున్నది ఒక చోట కాగా.. ఇంటి నిర్మాణం జరిగింది మరో ప్రాంతంలో అని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం.

స్థానిక తహసీల్దార్ ఏమన్నారంటే..


ఇది పట్టా భూమి అని, ముంపునకు గురికాలేదని ఆధారాలను చూపించి, ఇందులో ఎలాంటి అభ్యంతరాలు లేవని, ఒకవేళ ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని సంబంధిత రైతు డిక్లరేషన్ ఇచ్చి నాలా కన్వర్షన్ చేశామని చెప్పారు..

● సంబంధిత యజమానిని 'ఈనాడు' ఫోన్‌లో వివరణ కోరగా ఈ భూమిని రైతు నుంచే కొనుగోలు చేశానని ..శిఖంలో లేదని తెలిపారు.

నోటీసులు జారీ

సాగునీటి పారుదల శాఖ అధికారులు ఇది అక్రమ నిర్మాణమే అని రెవెన్యూ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని అటు అధికారులు, ఇటు ఇంటి యజమానికి నోటీసులు జారీ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో సర్వే నెంబర్ 125లో ఇంటి నిర్మాణం జరుగుతుండగా తమకు గత ఏప్రిల్‌లో సమాచారం రాగా వెళ్లి పరిశీలించామని డీఈఈ ప్రశాంతి తెలిపారు. సంబంధిత యజమానికి నోటీసు ఇచ్చామని చెప్పారు. ఎఫ్‌టీఎల్‌లో లేదని, పట్టా భూమిగా చెబుతున్నారని.. దీనిపై నిర్ధారణ కోసం రెవెన్యూ, నీటిపారుదల శాఖ కలిసి సర్వే చేయడానికి తహసీల్దార్‌కు ఉత్తరం రాశామని అన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు.

● ఇంటి నిర్మాణానికి అనుమతి లేదని, కూల్చివేయమని మండల పరిషత్ అభివృద్ధి అధికారికి కూడా లేఖ రాశామని పేర్కొన్నారు.



వరంగల్ బస్టాండ్ భవన సముదాయం (పాతచిత్రం)



కూల్చి వేసిన అనంతరం ఇలా..

ఉన్నది కూల్చారు.. నిర్మాణం మరిచారు!

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌కు ప్రస్తుతానికి ఆర్టీసీ బస్టాండ్ లేదు. ఓరుగల్లు రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో రెండున్నర ఎకరాల్లో ఉన్న పాత బస్టాండ్ భవన సముదాయాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో గతేడాది జూన్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.73.50 కోట్ల అంచనాతో కొత్త ప్రయాణ ప్రాంగణ నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అనంతరం పాత బస్టాండ్ నేలమట్టం చేశారు. ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు ప్రారంభించడం లేదు. పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో ప్రయాణికులు ఎండావానల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే గిర్మాజిపేట

ఎన్‌సీసీ జాతీయ శిక్షణకు ఎంపిక



సాయిచందన్

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల (కో ఎడ్యుకేషన్) బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ బి.సాయిచందన్ జాతీయ శిక్షణకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ ఎన్.రమణ తెలిపారు. సెప్టెంబర్ 26 గురువారం నుంచి అక్టోబర్ 6 వరకు బెంగళూరులో 20 మందికి 'రేడియో కంట్రోలర్ ఇన్ ఏరో మోడలింగ్ డిజైన్'లో శిక్షణ పొందుతారని పేర్కొన్నారు. శిక్షణకు బయలుదేరిన సాయిచందన్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి రాధిక, ఎన్‌సీసీ అధికారి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

శాస్త్రీయ పద్ధతుల్లో నేరాల దర్యాప్తు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే నేరాల దర్యాప్తు శాస్త్రీయ పద్ధతుల్లో చేయాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా కేసుల నమోదు, విచారణ, నిందితుల అరెస్టు, కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి, డీజీపీ కార్యాలయం నుంచి వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని, గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాల నివారణలపై చర్చించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. వంతెన పిల్లర్





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్ - ఇల్లెందు ప్రధాన రహదారిలో బయ్యారం శివారులోగల పాకాలవాగు వంతెనలోని ఓ పిల్లర్ వద్ద భారీగా మట్టి కోతకు గురైంది. పిల్లర్ చుట్టూ సుమారు 8 అడుగుల లోతు గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వంతెన దిగువ భాగానికి వెళ్తున్న రైతులు పిల్లర్ వద్ద ఏర్పడిన గొయ్యిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ అనిల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పిల్లర్ వద్ద గొయ్యి పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉన్నందున సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

– న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)

పర్యావరణ ప్రేమికుడి ఒంటరి పోరాటం

'ఆయన ఒకసారి జాతిపిత గాంధీజీ వేషం వేస్తారు. మరోసారి మెడలో ప్లాస్టిక్ సీసాల దండలు వేసుకొని కనిపిస్తారు. ఇంకోసారి జెండా పట్టుకొని పాదయాత్ర చేస్తూ దారి వెంట వెళ్లేవారందరినీ పలకరిస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఆయన తపనంతా.'



చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, చెరువులను కాలుష్య కాసారాలుగా చేయొద్దని ఒంటరి పోరాటం చేస్తున్నారు హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. వృత్తి రీత్యా ప్రయివేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నా.. ప్రవృత్తి మాత్రం పర్యావరణ పరిరక్షణే. అందుకే ఎక్కడ పర్యావరణ వినాశనం జరుగుతోందని తెలిసినా వెంటనే పాదయాత్రగా బయలుదేరి వెళ్లి దాన్ని ఆపాలంటూ గళమెత్తుతారు. –ఈనాడు, వరంగల్

చెరువుల్లోని వ్యర్థాలను ఏరివేస్తూ..

ప్రకృతిని కాపాడాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకునేవారు, ఫేస్‌బుక్‌లలో పోస్టులు చేసేవారు బోలెడు మంది. ప్రకాశ్ అలా కాదు.. మనం ఆచరించాకే ఇతరులకు చెప్పాలంటారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం అయ్యాక ఓరుగల్లులోని చెరువుల వద్దకు వెళ్లారు. ఒక్కో చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాను తొలగించి గట్టుపై కుప్పలుగా పోశారు. వాటిని తీసుకెళ్లాలని బల్దియా సిబ్బందిని కోరారు. వరంగల్ చిన్నవడ్డెపల్లి చెరువు, హనుమకొండ పద్మాక్షి గుండం, కాజిపేట బంధం చెరువుల వద్దకు వెళ్లి తనకు అందినంత మేర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ఇటీవల నిమజ్జనం తర్వాత చెరువుల్లోని చెత్తను ఏరివేస్తూ..

● ఈ పర్యావరణ ప్రేమికుడు ప్రతి రెండేళ్లకోసారి మేడారం మహా జాతరకు పాదయాత్రగా వెళతారు. జాతరలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని కాపాడాలనే సందేశం ఇస్తూ నాలుగు రోజుల పాటు వనదేవతల వద్దకు నడక సాగిస్తారు. గత ఫిబ్రవరిలో జరిగిన జాతరకు వినూత్నంగా జాతిపిత గాంధీజీ వేషం ధరించి దారి వెంట కనిపించిన వారిని పలకరిస్తూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందంటూ సందేశం ఇచ్చారు. పాఠశాల పిల్లలకు అవగాహక కల్పిస్తూ ప్రయాణం సాగిస్తారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మెడలో ప్లాస్టిక్ సీసాలు ధరించి ప్లాస్టిక్ నిర్మూలనపై వైవిధ్యంగా అవగాహన కల్పించారు.

అలా మొదలు..

ప్రకాశ్ 10వ తరగతి వరకు ములుగు జిల్లా మంగపేటలో చదువుకున్నారు. ఆ సమయంలో బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం బాగా వెలువడడంతో బిల్ట్ యాజమాన్యం అప్పుడప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటేది. పాఠశాల స్థాయిలో ఆ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పెద్దయ్యాక అటవీ అధికారి పురుషోత్తంతో పరిచయం అయ్యాక పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెరిగింది.

ఒక్కో అడుగు..

● 2018లో ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలని పాదయాత్రగా వెళ్లి ఉత్సవ నిర్వాహకులను, కాలుష్య నియంత్రణ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

● వికారాబాద్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం వెయ్యి మర్రిచెట్లను నరికేస్తారని తెలిసి ఓరుగల్లు నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం 'హైదరాబాద్ నేచర్ లవర్స్' సంస్థతో కలిసి చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి వృక్షాల హననాన్ని ఆపాలని ఫిర్యాదు చేయడంతో గ్రీన్ ట్రైబ్యునల్ స్పందించి చెట్ల నరికివేతపై స్టే ఇవ్వడంలో ప్రకాశ్ కృషి కూడా ఎంతో ఉంది.

● ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో దామగుండంలో రాడార్ కేంద్రం ఏర్పాటుపై పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న క్రమంలో త్వరలో అక్కడికి పాదయాత్రగా వెళ్లి తన గళాన్ని వినిపిస్తానని చెబుతున్నారు.



ప్రమాదాన్ని మరిచి.. చరవాణిలో నిమగ్నమై



ఇలా చూస్తుంటే అటో.. ఇటో



ఇలా రాజాలా కూర్చుంటే అంతే..

మిత్రమా.. రెప్పపాటులో చేజారుతుంది జీవితం!

రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అలాంటి హృదయవిదారక దృశ్యాలు వెలుగుచూస్తున్నాయి. అయినా చాలా మంది ప్రయాణికులు రైలు లోపల నిల్చోవడానికి స్థలం ఉన్నా తలుపు వద్ద కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. అక్కడ ఏ ఆధారం లేకుండా ప్రమాదకరంగా నిల్చుంటారు. చరవాణిలో మాట్లాడుతుంటారు. ఇది రైల్వే చట్టాల ప్రకారం నేరం. రూ.300 జరిమానా లేదా ఏడు రోజుల జైలు శిక్ష ఉంటుంది.

ఇదీ పరిస్థితి..

గురువారం సాయంత్రం 5 గంటలకు వడ్డెపల్లి చెరువు వద్ద సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లు ఇంటర్‌సిటీని పరిశీలించినప్పుడు ప్రతి కోచ్‌లోనూ ప్రతి తలుపు వద్ద కూర్చుని ఉన్న ప్రయాణికులు కనిపించారు. వడ్డెపల్లి చెరువు వద్ద రైలు గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణం చేస్తుండగా 'న్యూస్‌టుడే' తీసిన చిత్రాలు ఇవి..

–న్యూస్‌టుడే, కాజీపేట

కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో తలుపు వద్ద కూర్చుని జారి పడి మరణించిన వారి సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2021	13
2022	10
2023	18
2024	12

ముగిసిన రాష్ట్రస్థాయి జూడో పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన 68వ రాష్ట్ర స్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండోస్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా నిలిచింది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు.. కేసులు నమోదు



వరంగల్‌లో ఔషధాలు పరిశీలిస్తున్న అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ వైద్యమండలి అధికారులు, వరంగల్ యాంటిక్వాకరీ బృందం గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా.. వైద్యం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. తెలంగాణ వైద్యమండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వరంగల్ యాంటిక్వాకరీ బృందం, ఐఎంఏ, హెచ్‌ఆర్‌డీఏ జిల్లా సభ్యులు డా.వద్దిరాజు రాకేష్, డా.అన్వర్‌మియా, డా.వెంకటస్వామి, డా.అజిత్‌పాషాలు హనుమకొండలోని భీమారం, దీన్‌దయాళ్ కాలనీ, వరంగల్‌లోని రామన్నపేటలో తనిఖీలు చేశారు. పలువురు ఇష్టారాజ్యంగా యాంటిబయాటిక్ ఔషధాలు, నొప్పి నివారణ సూదులు(ఇంజక్షన్లు) ఇస్తున్నట్లు గుర్తించారు. వందల సంఖ్యలో స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్ ఔషధాలు, సూదులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అర్హత లేని వైద్యులపై ఎన్‌ఎంసీ 34, 54 యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు డా.నరేష్‌కుమార్ తెలిపారు. పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకొని వైద్యులు కాకున్నా.. పరిధి దాటి వైద్యం చేస్తున్న మహేందర్, జ్ఞానేశ్వర్‌లపై చర్యలు తీసుకోవాలని బోర్డుకు సిఫార్సు చేయనున్నట్లు వివరించారు.

నర్సంపేట: నర్సంపేటలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లను వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల యాక్టుకు లోబడి పరీక్షలు చేస్తున్నారా? లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ యంత్రాలు, రోగుల వివరాల పుస్తకాలతో పాటు ఇతర రికార్డులు పరిశీలించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

పదేళ్లలో జరగని అభివృద్ధి.. ఏడాదిలో చేసి చూపిస్తా..



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలో చేసి చూపిస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గడిచిన పదేళ్లలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి తనను, తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం ఎప్పటికీ తీర్చలేనిదన్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాటలే కాకుండా దానికి సంబంధించిన ఎజెండాను ప్రకటిస్తున్నట్లుగా వివరించారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అనేక అభివృద్ధి విషయాలపై గంటకు పైగా చర్చించానని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత భవనాల నిర్మాణం, మొదటి దశలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటుగా మున్సిపాలిటీకి సంబంధించిన జీవో, డిగ్రీ కళాశాల ఏర్పాటు, దేవాదుల కాల్వల మరమ్మతులు.. తదితర అభివృద్ధి పనుల గురించి వివరించగా ముఖ్యమంత్రి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు అక్టోబరు చివరి వారంలో ఉత్తర్వులు వస్తాయన్నారు. వెంటనే పనులకు టెండర్లు పిలిచి.. నవంబరు 15 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్‌కు తీసుకొచ్చి వేలమంది ప్రజల సమక్షంలో శంకుస్థాపన చేసి.. అదే రోజే ఘన్‌పూర్ మున్సిపాలిటీని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రకటించిన అభివృద్ధి పనులను 2026 జూన్ వరకు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని వెల్లడించారు. గాంధీ భవన్, ఏఐసీసీ చుట్టూ తిరిగేవారికి పదవులు రావని.. ప్రజల్లో ఉంటూ వారితో మమేకమై.. సమస్యలు పరిష్కరించేవారికే వస్తాయని కడియం శ్రీహరి మార్క్‌గా.. దానిని ఘన్‌పూర్‌లో అమలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, బెలిదె వెంకన్న, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మంచాల ఎల్లయ్య, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొంటాం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కోడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తాము సిద్ధంగా ఉన్నామని.. వాటి గురించి తాము ఆందోళన చెందడం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉందని చెప్పారు. తనకు ప్రజాస్వామ్యం, కోర్టులు, ఎన్నికల వ్యవస్థ పట్ల పూర్తి నమ్మకం ఉందని అన్నారు.. పదేళ్లలో 38 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న నీచ చరిత్ర కలిగిన భారాస ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల మీద మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని.. ఈ జిల్లాకు ఉన్న చరిత్ర, గొప్పతనాన్ని నాశనం చేయకూడదని ఎంత మొత్తుకున్నా తన మాట వినలేదని.. ఆ విషయంలో నేను ఎదరు తిరిగాను కాబట్టే రెండోసారి నాకు మంత్రి పదవి రాలేదని అన్నారు.


మైలారంలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో..


మొగుళ్లపల్లిలో..


బీసీ సంక్షేమశాఖ నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

ఐలమ్మ పోరాటం.. స్ఫూర్తిదాయకం


కొంపెల్లిలో..


తాడిచెర్లలో..

జిల్లా అంతటా గురువారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె ప్రాణాలకు ఎదురొడ్డి నిలిచారని కొనియాడారు. ఆమె స్ఫూర్తిదాయక పోరాటాలను స్మరిస్తూ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం


మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


కాటారంలో ..

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి: జయశంకర్‌కాలనీలో సింగరేణి వర్క్‌షాపు వెనుక రోడ్డు పక్కన చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- ప్రభాకర్‌రెడ్డి, జయశంకర్ కాలనీ**

● పారిశుద్ధ్యకార్మికులను పంపించి చెత్త చెదారాన్ని తొలగిస్తాం. **- హరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్**

పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీ ప్రాంతంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. **- సతీష్, జవహర్‌నగర్**

● తాగునీటి సరఫరా పర్యవేక్షించే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. **- సెగ్గం వెంకట రాణి, ఛైర్ పర్సన్**

రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని వినతి



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: గతంలో రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి, అనంతరం ఇతర శాఖలకు బదిలీ అయిన వీఆర్‌ఏలను తిరిగి మాతృ శాఖలోకి తీసుకోవాలని తహసీల్దార్ సునీతకు గురువారం వీఆర్‌ఏలు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ప్రభుత్వం ధరణిలో మార్పులు, నూతన రెవెన్యూ చట్టం తీసుకొస్తున్న నేపథ్యంలో వీఆర్‌ఏలు మరింత నాణ్యమైన సేవలందిస్తారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజయ్య, సదయ్య, బుచ్చయ్య, సారయ్య, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

కుంగుబాటుకు గురికావొద్దు!

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అసాంక్రమిక వ్యాధులకు లోనైన ప్రజలు మానసికంగా కుంగిపోకుండా అవగాహన కల్పించేందుకు రాష్ట్రస్థాయిలో కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మానసికంగా కుంగుబాటుకు గురయ్యే వ్యక్తులు 14416 నెంబర్‌కు కాల్ చేయడం వల్ల మానసిక నిపుణులు ఉచితంగా అవగాహన కల్పిస్తారన్నారు. అసాంక్రమిక వ్యాధులు ముఖ్యంగా పొగాకు, మద్యం, పోషకాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో సంభవిస్తున్నాయన్నారు. పొగాకు వినియోగం తగ్గించడానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కొముర‌య్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి రాథోడ్, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక అందించండి

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సిఫార్సుల మేరకు భూపాలపల్లి పట్టణం నుంచి 15 కిలోమీటర్ల విస్తీర్ణంలో గల గ్రామాల సమగ్ర నివేదికను మూడు రోజుల్లోగా అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భూపాలపల్లి పరిధిలోని గ్రామాల నివేదికల రూపకల్పనపై రెవెన్యూ, మున్సిపల్, సర్వే లాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్షించారు. పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా అధికారులు అందించే నివేదిక, చిత్రపటాన్ని ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, ఆర్డీవో మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, టీపీవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చెల్పూర్(గణపురం), న్యూస్‌టుడే: గ్రామాల్లో సురక్షితమైన మంచి నీటిని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం కేటీపీపీ సమావేశపు గదిలో మిషన్ భగీరథ, ఇంట్రా, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మంచినీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎక్కడైనా మంచి నీటి సమస్య ఉంటే పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో, పంచాయతీ ప్రత్యేక అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, మిషన్ భగీరథ ఎస్‌ఈ మల్లేశ్, ఇంజినీర్లు నళిని, మాణిక్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ముందు బీఎంఎస్ ధర్నా



భూపాలపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన తెలంగాణ, ఏపీలోని జెన్‌కో నుంచి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ, గురువారం సాయంత్రం భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం కార్యాలయం ముందు బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బొగ్గు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయా జీఎం కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం సింగరేణి అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నరసింహారావు, రఘుపతిరెడ్డి, నారాయణ, రాజ్‌కుమార్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని కారల్ మార్క్స్ కాలనీ, పోలీసు స్టేషన్ రోడ్డు, తదితర కాలనీల్లో గురువారం కల్వలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శంకుస్థాపన చేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.40 కోట్ల వరకు నిధులు కేటాయించామని, ఈ నిర్మాణ పనులు సకాలంలో, నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జయశంకర్ విగ్రహం నుంచి తహసీల్దారు రోడ్డు విస్తరణ పనులకు రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోదావరి తీరం.. కావాలి శుభ్రతకు నిలయం

భక్తులు వదిలేస్తున్న వ్యర్థ వస్తువులు, పాత దుస్తులతో కాళేశ్వరం వద్ద గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోంది. ఇటీవల కాళేశ్వరం వచ్చిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌కు ఈ విషయమై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు తీరం వద్ద అధికారులు చెత్త చెదారం వేసేందుకు డ్రమ్ములు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు, పంచాయతీ అధికారులు కలిసి ప్రయోగాత్మకంగా అయిదింటిని ఏర్పాటు చేశారు.


భక్తులు తమ వ్యర్థాలను వీటిలో వేసి తీర శుభ్రతను పాటించాలని అధికారులు కోరుతున్నారు.

– కాళేశ్వరం, న్యూస్‌టుడే

సంక్షిప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్ మేళా

చిట్యాల, న్యూస్‌టుడే: పోషణ మాసోత్సవాల్లో భాగంగా చిట్యాల మండలంలోని జడల్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. 38 మంది చిన్నారుల ఎత్తు, బరువులను సరి చూశారు. పోషణ మాసం ప్రతిజ్ఞ చేశారు. వైద్యుడు వెంకన్న, పాఠశాల హెచ్‌ఎం వాసంతి, ఉపాధ్యాయురాలు జహీరా బేగం, హెల్త్ సూపర్‌వైజర్ సుగుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ నీటి సరఫరా సహాయకులకు శిక్షణ

చిట్యాల: నల్‌జల్ మిత్రలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలాల గ్రామీణ నీటి సరఫరా సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో టేకుమట్ల ఎంపీడీవో అనీత, ఎంపీవో సురేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల రుణమాఫీ హర్షణీయం

చిట్యాల: ప్రభుత్వం చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ చల్లగరిగె గ్రామంలో గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మెరుగు సంపత్‌కుమార్, మెరుగు సమ్మయ్య, సామల రాజేందర్, శ్రీనివాస్, దుబాసి నర్సయ్య, సదయ్య, రమేశ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గణపురం: గ్రామీణ ప్రాంత ప్రజలు జీఎస్‌రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం గణపురం మండలం గొల్లపల్లిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వృద్ధుడి మృతి

టేకుమట్ల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన బూర్నపల్లి శివారులో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వెంకట్రావ్‌పల్లికి చెందిన పొన్నం మల్లయ్యగౌడ్(65) అనే గీత కార్మికుడు మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. గమనించిన రైతులు, పశువుల కాపరులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిట్యాల సీహెచ్‌సీకి తరలించారు.

పారిశుద్ధ్య సిబ్బందికి కిట్ల పంపిణీ

మల్హర్, న్యూస్‌టుడే: తాడిచెర్ల పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి గురువారం సబ్బులు, కొబ్బరి నూనె, బెల్లం కిట్‌లను డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పంపిణీ చేశారు. కార్యదర్శి రాజును అధికారులు అభినందించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

కాటారం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు, కార్యవర్గ సభ్యుడు పోలం రాజేందర్ అన్నారు. గురువారం ఇక్కడ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మండల ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఏ.శ్రీకాంత్, సభ్యులు మహేందర్, స్మరణ్, మల్లేశ్వరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపం ఏర్పాటు



మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మొట్లపల్లి గ్రామంలోని అంబేడ్కర్ కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర వీధి దీపం వెలగడం లేదు. మహిళలు, పిల్లలు రాత్రివేళల్లో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ విషయాన్ని కాలనీ యువకులు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి సుజాతకు వివరించగా.. స్పందించి గురువారం సిబ్బందిని పంపించి వీధి దీపం ఏర్పాటు చేయించారు.

ఉపకార వేతన బకాయిలు చెల్లించరూ..

భూపాలపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులకు సంబంధించిన ఉపకార వేతన బకాయిలు, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించే మహాగర్జన సభకు సంబంధించిన గోడ పత్రికలను నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, మహేష్, నవీన్, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

కొత్తపల్లిగోరి,(రేగొండ), న్యూస్‌టుడే: కొత్తపల్లిగోరి మండల ఎంఈవోగా ఒంటేరు చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఓ గదిని ఎంఈవో కార్యాలయానికి కేటాయించారు. పాఠశాల ఉపాధ్యాయుల మధ్య చంద్రశేఖర్ రికార్డులో సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాల్సిందే..


జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి డివిజన్ బంగ్లాస్ ఏరియాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఒప్పంద కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గురువారం సాయంత్రం స్థానిక సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఒప్పంద కార్మికులు కొద్ది సేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నాయకులు బందు సాయిలు, రాజయ్య మాట్లాడుతూ.. గుత్తేదారు, సూపర్‌వైజర్ కలిసి కార్మికులపై అధిక పని భారాన్ని మోపుతూ, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రతి నెలా 7వ తేదీన కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని, అధిక పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం జీఎంకు వినతి పత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రమేష్, భిక్షపతి, లక్ష్మి, శ్యాంకుమార్, శంకర్, రాజయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ సంతకాల సేకరణ



భూపాలపల్లి, న్యూస్‌టుడే: గడిచిన ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాల్లో నుంచి మాత్రమే కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ భూపాలపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు రూ.1,551 కోట్ల నుంచి 33 శాతం లాభాల బోనస్ చెల్లించాలని కోరుతూ, గురువారం భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనుల్లో టీబీజీకేఎస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. సింగరేణి సంస్థ పూర్తిగా సాధించిన లాభాల్లో వాటా చెల్లించకుండా మోసం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, రవీందర్, మల్లారెడ్డి, అవినాష్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందజేత

చిట్యాల, న్యూస్‌టుడే: చిట్యాల మండలం జడల్‌పేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజికవేత్త కామిడి సతీశ్‌రెడ్డికి రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో నేషన్ బిల్డర్ అవార్డు అందజేశారు. హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయనను వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాస్ శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ శరత్‌బాబు, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రావు, విజయ్‌కుమార్, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులతో తహసీల్దార్, ఎంఈవో, నేతలు

రేగొండ,న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని తహసీల్దార్ శ్వేత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమానికి తహసీల్దార్, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల ఎంఈవోలు ప్రభాకర్, చంద్రశేఖర్ హాజరయ్యారు. సంఘం మండలాధ్యక్షురాలు అరవింద సమక్షంలో 16 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి, జిల్లా, మండల నేతలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సరోత్తంరెడ్డి, కృష్ణకుమారి, విజయ్‌కుమార్, భాస్కర్, నవీన్, శ్రీధర్‌రెడ్డి,సాగర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు హనుమకొండలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుందని డీఈవో డి.వాసంతి గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 274 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు తమ ధ్రువపత్రాల పత్రాలతో హాజరుకావాలని సూచించారు. కాంట్రాక్టు పద్ధతిలో వారిని ఉపాధ్యాయులుగా నియామకాలు చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు


మహదేవపూర్‌లో..

కాటారం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో అకారణంగా విధుల నుంచి సస్పెండైన కార్యదర్శులకు సంఘీభావంగా మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శంకరయ్య, షగీర్‌ఖాన్, ఉమాదేవి, లక్ష్మీ, శ్రీనివాస్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్, న్యూస్‌టుడే : నల్గొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్ నిరసిస్తూ మహదేవపూర్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో, కార్యదర్శులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోషకాహారంపై ప్రతిజ్ఞ

కాటారం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గురువారం బాలికలతో ప్రతిజ్ఞ నిర్వహించారు. హాజరైన ఐసీడీఎస్ సీడీపీవో రాధిక మాట్లాడుతూ..పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రతి రోజూ తప్పక తీసుకోవాలన్నారు. డీసీపీవో వెంకటస్వామి, డీహెచ్‌ఈడబ్ల్యూ డీసీ అనూష, ఛైల్డ్ కోఆర్డినేటర్ తిరుపతి, సూపర్‌వైజర్లు శివరాణి, వీణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


కాటారంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

ఏఎన్ఎంలకు శిక్షణ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు అమ్మ కోసం మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించి అమ్మ కోసం యాప్‌పై ప్రత్యేక శిక్షణ అందించారు. డీఎంహెచ్‌వో మట్లాడుతూ యాప్ ద్వారా గర్భిణుల ఆరోగ్య సమాచారం తెలుస్తుందన్నారు. రక్తహీనత, రక్తపోటు, డయాబెటీస్, జాండీస్, క్షయ, జ్వరం, హెచ్ఐవీ తదితర ప్రమాదకర పరిస్థితుల నుంచి గర్భిణులను ఎలా రక్షించాలి అనే పద్ధతులను ప్రతి 20 రోజులకు ఒకసారి యాప్ ద్వారా ఏఎన్ఎంలకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రోహిణి, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గిన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్

నేడు భవిష్య నిధిపై అవగాహన సదస్సులు

కాజీపేట, న్యూస్‌టుడే: భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు, గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ కమిషనర్ ఎస్.దానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రిలో, హనుమకొండ రాంపూర్‌లోని తిరుమల హెచరీస్‌లో, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపాలిటిటీ, జనగామ సెయింట్ మేరిస్ హైస్కూల్, జయశంకర్ భూపాలపల్లి ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యనిధి ఖాతాదారులు, ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకుని వెంటనే పరిష్కారం పొందవచ్చని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చిట్యాల, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్‌ఎం తిరుపతి, వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు సంతోశ్ అన్నారు. గురువారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చిట్యాల మండలం నైన్‌పాక గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మట్టితో విత్తన బంతులను తయారు చేయించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని 10 వేల విత్తన బంతులను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, శ్యామ్‌సుందర్, అనీల్ గవాస్కర్, హసీనా, ఇక్రామొయిద్దీన్, వాసవి క్లబ్ ప్రతినిధులు నూక కృష్ణ, చిన్నాల రమేశ్, నగునూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


విత్తన బంతులు తయారు చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ రహిత కాళేశ్వరం చేద్దాం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రమైన కాళేశ్వరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్ది జిల్లాకు మార్గదర్శకం కావాలని మహదేవపూర్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం గురువారం కాళేశ్వరంలోని పలు వ్యాపార సంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ నిర్వహించిన సమావేశాన్ని గుర్తు చేస్తూ అతి త్వరలో కాళేశ్వర క్షేత్రం రూపురేఖలు మారుతున్నట్లు తెలిపారు. ఆయా దుకాణాలలో ప్లాస్టిక్ బ్యాగ్‌ల సరకు నిల్వలు ఉన్న కారణంగా తమకు నెల రోజుల సమయం కావాలని వ్యాపారులు కోరారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు బుర్రిశ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వ్యాపార సంస్థల అధ్యక్షులు గండెసిరి మధుసూధన్ పాల్గొన్నారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు